# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# ఎవుసాన్ని అడ్డుకుంటున్నరు

● ఆ నాయకులకు ఎవుసం గురించే తెల్వది ● ఆ పార్టీ తీరుపై రైతుల ఆగ్రహం

అభివృద్ధి చెందుతున్న వ్యవసాయాన్ని అడ్డుకునేలా కాంగ్రెస్ నాయకుల ప్రకటనలున్నాయి. రైతుల భూములకు భద్రత కల్పించిన ధరణిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రకటనలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రైతులకు మేలు చేసే ధరణి ఎత్తివేసి రైతులను వీధిన పడేస్తారా? 3 గంటల కరెంట్‌తో వ్యవసాయం చేయడం సాధ్యమయ్యేపనేనా. 24 గంటల కరెంట్ ఇచ్చి సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తే కాంగ్రెస్ నాయకులు మాత్రం వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలు అంటూ ప్రకటనలు చేస్తున్నారు. రైతులు వ్యవసాయం చేయకుండా కాంగ్రెస్ అడ్డుకునేలా ప్రవర్తిస్తున్నది.. అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పయ్..



బజార్‌హత్నూర్, నవంబర్ 28 : గతంలో కాంగ్రెస్ పార్టీ ఏనాడూ రైతుల గురించి పట్టించుకోలేదు. పైగా ఇప్పుడచ్చి అది చేస్తాం.. ఇది చేస్తాం అంటే నమ్మేటోళ్లు లేరు. వ్యవసాయానికి 3 గంటల కరెంటిస్తామని చెబుతున్నరు. గా మూడు గంటల కరెంట్‌తో మూడు మడులు కూడా తడువయి. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల నాణ్యమైన విద్యుత్‌తో నేడు రైతులు సంతోషంగా ఉన్నారు. పుష్కలంగా పంటలు పండించుకుంటూ ఆర్థికంగా లాభాలు పొందుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు తప్పవు.

**- కిరప్ప శ్రీనివాస్, రైతు, బజార్‌హత్నూర్**

### టెన్ హెచ్‌పీ మోటర్లు ఎట్ల పెడుతరు..

ఉట్నూర్, నవంబర్ 28 : రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడమంటే చాలా కష్టం. అసలే పేదరికం మందులు, ఎరువులు కొనేందుకు ఇబ్బంది పడుతంటరు. అలాంటి వారు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టి ఎవుసం చేస్తరా. కాంగ్రెస్ అంటనే గిట్ల చేస్తది. తెల్వి లేని మాటలు మాట్లాడ్తది. మూడు గంటల కరెంటిస్తమని వాళ్ల లీడరు రేవంత్ రెడ్డి చెబుతున్నడు. అందుకే వాళ్లను నమ్మొద్దు. మళ్లా ఎవుసం దండుగ చేస్తరు. మళ్లీ తెలంగాణ పార్టీని గెలిపించుకొని రైతులకు అందిస్తున్న రైతుబంధు, 24 గంటల కరెంట్, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు తీసుకుంటం. రైతుబంధుతో మా ప్రాంతంలో రైతుల కష్టాలు దూరమయ్యాయి. అందుకే సీఎం కేసీఆర్ సారే మళ్లా గెలవాలె.

**- జాదవ్ విజయ్, చాందూరి, ఉట్నూర్**

### ఎవుసం బంద్ పెట్టుడే అయితది..



ఉట్నూర్ రూరల్, నవంబర్ 28 : కాంగ్రెస్ వాళ్లను నమ్మితే ఎవుసం బంద్ పెట్టుడే అయితది. మా రైతులకు మంచిగ కరెంటిచ్చింది కేసీఆర్ గవర్నమెంటే. 24 గంటగలు ఒక సారిగూడ పోకుండా కరెంటు ఉంటాంది. వీళ్లు 3 గంటల కరంటే ఇస్తమంటున్నరు. గిట్లయితే ఎకరంల కూడా ఎవుసం చేసుడు కుదరదు. గసోంటి ప్రభుత్వం మాకద్దు. మునుపు పెట్టిన తిప్పలు ఇంకా యాది మరువలే. తెలంగాణ ప్రభుత్వం వచ్చినకంనే రైతుల బతుకులు మారుతున్నయ్. గిప్పుడే ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నం. అంతకుముందు ఒక్క పంట కూడా సరిగా పండేది కాదు. మళ్లా కేసీఆర్ గవర్నమెంటే రావాలే. దానికే మేము ఓటేస్తం.

**- మడావి మోకాసీ, కామాయిపేట్**

### కాంగ్రెసోళ్లను బంగాళాఖాతంలో కలుపుతరు..



ఇచ్చోడ, నవంబర్ 28: ధరణి పోర్టల్ ఉంటనే రైతుల భూమికి భరోసా ఉంటది. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే భూములకు సంబంధించిన కాగితాలను వీఆర్వోలకు అందజేసి వారు రికార్డుల్లోకి ఎక్కించే వరకు తిరగాల్సిన పరిస్థితి ఉంటుండే. ఇప్పుడు ఆ తిప్పలు లేవు. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. క్షణాల్లో మన పేరిట భూమి రికార్డుల్లో నమోదవుతుంది. ధరణి లేకపోతే కార్యాలయాల్లో ఎప్పుడు మన భూమి మన పేరు మీద ఉంటదో, రాత్రికి రాత్రి ఇంకోళ్ల పేరు మీదకు మారుతుందో తెలియదు. పహాణీల వ్యవస్థ ఉన్నప్పుడు ఎంతో మంది భూములు ఇంకొకరి పేరు మీదికి మార్పిడి అయ్యాయి. అంత అవినీతిమయంతో ఉండేది. ఇప్పుడు ఆ బాధ లేదు. మన భూమి మన చేతిలోనే ఉంటది. ధరణి లేకపోతే వ్యవసాయ భూములు ఎప్పుడు ఎవరి పేరు మీద మారుస్తున్నరో తెలియకపోయేది.ధరణిని బంగాళాఖాతంలో కలుపుతమన్న కాంగ్రెస్‌నే అండ్ల కలపాలె. వాళ్లు చెయ్యవట్టి రాష్ట్రానికి మంచి జరగది.

**- బాగ్వాత్ పనుపడే, రైతు, జామిడి, ఇచ్చోడ మండలం**

### 10 హెచ్‌పీ వద్దు.. కాంగ్రెస్ వద్దు..



ఉట్నూర్, నవంబర్ 28 : చిన్న, సన్నకారు రైతులకు 10 హెచ్‌పీ మోటర్లు కొనాలంటే ఇబ్బందయితది. అలాగే కాంగ్రెస్ వక్ర మాటలు నమ్మే పరిస్థితది లేదు. రాష్ట్రం సాధించుకున్నాక రైతులకు అడగక ముందే కేసీఆర్ అన్ని పథకాలు ఇచ్చిన్రు ఆయనకు ఒక్కరికే ఓటు అడిగే హక్కు ఉంది. ఆయన 24 గంటల కరెంట్ ఇస్తుంటే, కాంగ్రెసోళ్లు మూడు గంటలు చాలంటున్రు. వారికి రైతులపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. కనుక వారిని ఎవరు ఆదరించరు. రైతులైతే వారిని క్షమించరు. కాంగ్రెసోల్లు చెప్పినట్లు మూడు గంటల కరెంటిస్తే రెండు దొయ్యలు గూడ తడి పారది. మూడు గంటలని కాంగ్రెసోల్లు ఎట్ల చెప్పుతున్నరో తెల్వది. అయినా వాళ్లు గెలిచేది లేదు సచ్చేది లేదు. తెల్వి లేని మాటలు మాట్లాడితే రైతులు ఊకోరు.**- పుర్రె వెంకటరమణ యాదవ్, చాందూరి**

### మూడు గంటలిస్తే మాకెందుకు..?



ఉట్నూర్, నవంబర్ 28 : కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటిస్తే మాకెందుకు. రైతులకు మంచి చేసేటోళ్లు కావాలె. గిట్ల కొర్రీలు పెడుతం.. పుల్లలు పెడుతం అనేటోళ్లను నమ్మొద్దు. రైతులు రైతుల జీవితాలతో ఆడుకునే పార్టీలను బొందపెట్టాలి. పంటలకు 24 గంటల కరెంట్ ఇచ్చేటోళ్లే కావాలె. గతంలో నాణ్యమైన కరెంటు రాకపోవడంతో మోటర్లు కాలిపోయి చాలా కష్టమయ్యేది. ఇప్పుడు ఆ కష్టాలు లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు 24గంటల కరెంటు ఇస్తుండడంతో వ్యవసాయం పండుగలా మారింది. ఆ కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. గానీ, మూడు గంటల కరెంటుతో మళ్లీ ముప్పుతిప్పలు పెట్టాలని చూస్తున్నరు. కేసీఆర్ సార్ పాలనలోనే రైతన్నలు సల్లంగా ఉన్నరు.

**- రాథోడ్ నాగోరావు, పులిమడుగు, ఉట్నూర్**

### ధరణి ఉంటెనే భూములకు రక్షణ..



ఉట్నూర్ రూరల్, నవంబర్ 28: తెలంగాణ గవర్నమెంటు తెచ్చిన ధరణి ఉంటనే మా భూములకు రక్షణ ఉంటది. కాంగ్రెస్ గతంలో చేసింది మేం మర్చిపోలే. మళ్లీ వాళ్లనెట్ల గెలవనిస్తం. గతంలో పని కావాలంటే ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. గిప్పుడు ఎవరి అనుమతి లేకుండా మీసేవకు పోయి పహానీ తీసుకుంటున్నం. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తాం అంటున్నరు. అలాంటి గవర్నమెంటు మాకొద్దు. కేసీఆర్ ఏం తక్కువ చేయలేదు. కరంటు, రైతు బంధు ఇస్తుండు. అది వాళ్లకు కూడా తెలుసు. అట్టిగ రైతులను గోస పెట్టుడే తప్ప ఒరిగిందేమి లేదు.. అప్పుడున్న ప్రభుత్వాలు రైతులకు చేసిందేమీ లేదు. ఇప్పడే మేము రంది లేకుండా ఎవుసం చేసుకుంటున్నం. అందుకే మళ్లీ కేసీఆర్‌కే ఓటేస్తం.

**-భక్తు స్వామి, రైతు, గంగన్నపేట్**

### 3 గంటల కరెంట్‌తో కన్నీరే..



బజార్‌హత్నూర్, నవంబర్ 28 : 3 గంటల కరెంట్ ఇస్తే రైతులు వ్యవసాయం మానుకోవాల్సిందే. ఆ కరెంటుతో రైతులకు కన్నీరు తప్ప మిగిలేదేమీ ఉండదు. 3 గంటలంటే 5 హెచ్‌పీ మోటరు బదులు 10 హెచ్‌పీ మోటరు పెట్టాలి. 3 గంటల కరెంట్ ఇచ్చినప్పుడు రైతులంతా ఒకేసారి 10 హెచ్‌పీ మోటర్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతాయి. బావుల్లో నీరు ఇంకిపోతుంది. ఊట అందదు. పైగా అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇవి తెలివితక్కువ మాటలు. వ్యవసాయం చేసేటోళ్లకే తెలుస్తుంది. పిచ్చి మాటలు పట్టించుకోం. మళ్లీ కాంగ్రెస్ పాలన వస్తే గతంలో కరెంట్ కష్టాలు మళ్లీ వస్తాయి. బీఆర్ఎస్ సర్కారు ఇస్తున్న 24 గంటల కరెంట్‌తోని ఎవుసం మంచిగ చేసుకొని బతుకుతున్నం. మేమంతా బీఆర్ఎస్ వెంటే.

**- కీర్తి సాయినాథ్, రైతు, బజార్‌హత్నూర్**

### కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయాం..



జైనథ్, నవంబర్ 28 : ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ స్వయాన రైతు బిడ్డ. రైతుల కష్టాలను దూరం చేయడానికే దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటలు ఉచితంగా కరెంటు ఇస్తున్నాడు. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ సరిపోతుందంటున్నారు. వారు అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు తప్పవు. తెలంగాణ రాష్ట్రంలోనే రైతుబంధు, రైతుబీమాలాంటి పథకాలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న కేసీఆర్‌కే నా ఓటు. ఇది వరకే కాంగ్రెస్ నమ్మి మోసపోయాం.. మళ్లోసారి నమ్మితే ఏమీ మిగలదు. మళ్లా పాతరోజులు తీసుకత్తరు. మమ్ములను కష్టాలపాలుజేత్తరు. వామ్మో మాకు అవి వద్దేవద్దు..

**- నూతుల రాంచందర్ రెడ్డి, కరంజి, జైనథ్ మండలం**